
సాక్షి
చిత్తూరు
గురువారం । 9 । అక్టోబర్ । 2025



కట్టమంచి.. ప్రమాదం పొంచి

కట్టమంచి చెరువులో ఇష్టానుసారంగా మట్టి తవ్వడంతో ప్రమాదం పొంచి ఉంది. భారీ వర్షాలు కురిస్తే తెగే పరిస్థితి నెలకొంది. - 8లో



ఎర్రచందనం స్వాధీనం

బెరెడ్డిపల్లె మండలంలోని నెల్లిపట ప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది దాడులు చేసి దుంగలు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



ఏనుగుల దాడి

పులిచర్ల మండలంలో ఏనుగుల దాడులు ఆగడంలేదు. మర్రికుంటవారిపల్లె, దేవళం పేట పొలాలను ధ్వంసం చేశాయి. - 8లో

న్యూస్‌రీల్

అందుబాటులో స్కానింగ్ మిషన్లు



మిషన్‌ను ప్రారంభిస్తున్న ఆలయ, బ్యాంకు అధికారులు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం భక్తులు విరాళాలు సమర్పించేందుకు స్కానింగ్ మిషన్లను ఏర్పాటు చేశారు. యూనియన్ బ్యాంకు సౌజన్యంతో అందజేసిన ఈ మూడు మిషన్లను ప్రారంభించారు. నిత్య అన్నదానం, గోసంరక్షణ, ఆలయ అభివృద్ధికి విరాళాలు సమర్పించే భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, బ్యాంకు జీఎం శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమ స్కానింగ్.. మొక్కుబడి విచారణ !

కాణిపాకం : మూడు నెలలకు కిందట చిత్తూరు నగరంలో పట్టుబడ్డ అక్రమ స్కానింగ్ కేసులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది హస్తం ఉందని తేలింది. అతడిపై చర్యలు తీసుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నాన్చుతూ వచ్చారు. ఈ జాప్యం విమర్శలకు దారితీసింది. కాసులకు అమ్ముడుపోయి.. మిన్నకుండిపోయారని ఆరోపణలు గుప్పుమన్నాయి. దీనిపై సాక్షి దినపత్రికలో అక్రమ గుట్టురట్టుపై చర్యలేవీ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. ఓ డాక్టర్‌కు విచారణ బాధ్యతలను అప్పగించారు. మంగళవారం ఆ డాక్టర్ విచారణకు వెళ్లారు. అయితే ఈ విచారణ తూతూమంత్రంగా సాగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీస అవగాహన లేని డాక్టర్‌కు విచారణ బాధ్యతలు అప్పగించడం ఏమిటని సొంత శాఖలోని అధికారులే పెదవి విరుస్తున్నారు. ఇదంతా అక్రమార్కులను తప్పించడానికి చేస్తున్న ప్రయత్నాలనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ పట్టుకున్న కేసులోనే ఈ రకంగా జాప్యం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : డీఆర్‌డీఏ ఏపీఎం, సీసీలు విధుల పట్ల అలసత్వం వహించకుండా బాధ్యతగా పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏపీఎం, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బ్యాంక్ లింకేజ్, మైక్రో క్రెడిట్ యాన్యువల్ యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మొక్కలు నాటే ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో స్త్రీ నిధికి రూ.346 కోట్ల రుణాలు, ఉన్నతిలో రూ.20 కోట్లు, సామాజిక పెట్టుబడి నిధి రూ.6 కోట్లు నిధులను అర్హులకు అందజేయడం జరుగుతోందన్నారు. డీఆర్‌డీఏ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తులు వేచి ఉన్న క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,634 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,980 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తిచేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారికి క్యూలోకి అనుమతించరని స్పష్టంచేసింది.

రోగులు విలవిల



కుర్మాయిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్



పల్లెల్లో జ్వరాలు దడ పుట్టిస్తున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఏ ఇంట చూసినా జ్వర బాధితులే. వైద్యులు సమ్మె బాట పట్టడంతో సేవలు మొక్కుబడిగా మారాయి. స్థానికంగా ఆదుకోవాల్సిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు సేవలకు దూరంగా నిలిచాయి. ఫలితంగా జ్వర బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇంటి వద్దకే వస్తున్న 104 సేవలు నిలిచిపోవడంతో ప్రభుత్వ వైద్య సేవలు పడకేశాయి.

- పల్లె వైద్యానికి సుస్తీ
- జిల్లాలో దారి తప్పిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- సమయపాలన పాటించని వైద్యసిబ్బంది
- సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు
- సమ్మె ప్రభావంతో 104 సేవలు బంద్
- ముసురుకుంటున్న వ్యాధులు

కాణిపాకం : పల్లె వైద్యం పడకేసింది. జనం అనారోగ్యం బారిన పడుతున్నారు. పల్లె జనానికి సేవ చేయాల్సిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు దారి తప్పాయి. సిబ్బంది సమపాలనను గాలికొదిలేశారు. దీనికితోడు పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టారు. ఈ ప్రభావంతో 104 సేవలు బంద్ అయ్యాయి. దీంతో పల్లె జనానికి వైద్య సేవలు కరువయ్యాయి. మందు బిల్లులు సైతం దొరకడం కష్టతరంగా మారింది. వ్యాధులు ముసురుకుంటున్నాయి. పల్లె జనం వైద్యం కోసం విలవిల్లాడుతున్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



కురుస్తున్న భారీ వర్షాలకు వాతావరణంలో మార్పుల కారణంగా పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా పల్లెలకు విష జ్వరాలు పట్టుకున్నాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు మంచం పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఆర్‌ఎంపీ క్లినిక్‌లు సైతం కిక్కిరిసిపోతున్నాయి. ఇలాంటి తరుణంలో సేవలందించాల్సిన వైద్య బృందం పల్లెకు దూరమై..సొంత సేవలకు పరిమితమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. జబ్బు పడిన పల్లె వైద్యానికి చికిత్స చేయాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో 464 విలేజ్ హెల్త్ క్లినిక్‌లున్నాయి. వీటి కింద 435 మంది మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు పనిచేస్తున్నారు. అలాగే ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు సైతం క్లినిక్ కేంద్రంగా సేవలు అందిస్తున్నారు. గతంలో ఇక్కడకు వేల సంఖ్యలో ఓపీలొచ్చేవి. వైద్య సలహాలు తీసుకునేందుకు వేల సంఖ్యలో జనం క్యూ కట్టేవారు. అలాగే క్రమం తప్పకుండా మందులు, మాత్రలు తీసుకునేందుకు బారులు తీరేవారు. ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా మెరుగైన వైద్య సేవలను పొందేవారు. ఇటీవల ఈ సేవలు పల్లె జనానికి దూరమయ్యాయి.

సమావేశాల పేరుతో విధులకు డుమ్మా

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల సమయపాలన గాడి తప్పింది. అక్కడి సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలు విధుల్లో ఉండాల్సి ఉండగా... సక్రమంగా ఉండడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పలుచోట్ల ఉదయం 10, 11 గంటలకు తలుపులు తెరుస్తున్నారు. ఆ తర్వాత వచ్చినా సొంత పనుల మీద వెళ్లిపోతున్నారు. కొందరు మధ్యాహ్నం నుంచి డుమ్మా కొడుతున్నారు. సాయంత్రం 4 గంటలలోపే తాళం వేసి వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో అటెండెన్స్‌ను అసలు పట్టించుకోవడం లేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లె ముంగిటకే సేవలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య సేవలను పల్లె ముగింటకే తీసుకొచ్చింది. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పేరుతో ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పింది. ఆ కేంద్రాలకు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించింది. 150 రకాల మందులు, మాత్రలను అందుబాటులో ఉంచింది. 14 రకాల పరీక్షలు అక్కడే చేసేలా చర్యలు తీసుకుంది. కేంద్రం ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని విధిగా నిర్వర్తిస్తూ వచ్చింది. టెలీ మెడిసన్ విధానం ద్వారా వైద్య సేవలను సులభతరం చేసింది. తద్వారా పల్లె జనానికి వైద్య ఆరోగ్య సేవలను చేరువ చేసింది. ఈ సేవలను నిత్యం పర్యవేక్షిస్తూ..లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దేలా చర్యలు చేపట్టింది. పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్ల విధానాన్ని తీసుకొచ్చింది. ఫేషియల్ అటెండెన్స్‌ను తీసుకొచ్చి సేవలను పారదర్శకంగా అమలు చేసింది. పల్లె జనానికి ఆరోగ్య భరోసాను కల్పించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ వైద్య సేవలను నీరుగారుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కుంటుపడిన సేవలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య సేవలు కుంటుపడ్డాయి. పల్లె వైద్యం పడకేసింది. పీహెచ్‌సీల్లో వైద్యం ఆమడ దూరంలో నిలిచింది. మందులు, మాత్రలు కరువవుతున్నాయి. వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రస్తుతం పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టారు. దీంతో పీహెచ్‌సీల్లో వైద్యం చేసేవారు లేక వెలవెలబోతున్నాయి. ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజల సంఖ్య పూర్తిగా తగ్గుముఖం పట్టింది. వచ్చినా డాక్టర్లు లేరని ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. సమ్మె ప్రభావంతో పీహెచ్‌సీతో పాటు 104 సేవలు స్తంభించాయి. సమ్మె ప్రారంభం నుంచి 104 వాహనం పల్లెల్లో కనిపించకుండా కనుమరుగయ్యాయి. ప్రధానంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నాయి.

ఎవరైనా అడిగితే ఫీల్డ్‌లో ఉన్నాం, సర్వేలో ఉన్నాం, వ్యాక్సినేషన్, మీటింగ్ పేర్లతో విధులకు డుమ్మా కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఫిర్యాదులు వచ్చినా లెక్క చేయక

విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సమయ పాలనపై అధికారులకు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. 20 రోజుల క్రితం డీఎంహెచ్ఓ ఓ ప్రకటన విడుదల చేశారు. అందరూ విధిగా ఉదయం 9 గంటలకే క్లినిక్‌లను తెరవాలని సూచించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లిందని అందులో పేర్కొన్నారు. అయినా చాలా మంది మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు వాటిని లెక్క చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు విధిగా సమయ పాలన పాటించాల్సిందే. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే కచ్చితంగా చర్యలు ఉంటాయి. ఎక్కడెక్కడ లోటు పాట్లు ఉన్నాయో.. విచారణ చేస్తాం. సమయ పాలన పాటించని వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. పల్లె జనానికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తాం.

– సుధారాణి, డీఎంహెచ్ఓ, చిత్తూరు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

తిరుపతి కల్చరల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంటు)గా నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు చిత్తూరు జిల్లా పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మొగసాల రెడ్డెప్ప, చిత్తూరు అసెంబ్లీ నియోజవర్గానికి చెందిన రాహుల్ రాజారెడ్డి, పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పృథ్వీరెడ్డి(వల్లివేడు రాజారెడ్డి)లను రాష్ట్ర కార్యదర్శులుగా నియమించింది. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజనల్ కో -ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరించనున్నారు.

రహదారుల మరమ్మతుకు రూ.35.40 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో రహదారుల మరమ్మతుకు రూ.35.40 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లాలోని 12 రహదారుల్లో మరమ్మతు పనులు చేపట్టనున్నారు. పనుల నిర్వహణకు పాలనా పరమైన అనుమతులను మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు–పుత్తూరు రహదారి 5.60 కి.మీలకు రూ.3 కోట్లు, చిత్తూరు–గుడియాత్తం రోడ్డు 11.77 కి.మీలకు రూ.7.50 కోట్లు, గెసికపల్లి–కనమనపల్లె రోడ్డు 6 కి.మీలకు రూ.2.60 కోట్లు, గరిగచేనుపల్లి–పీలీనత్తం రోడ్డు 7 కి.మీకు రూ.2.60 కోట్లు, రాళ్లబుదుగూరు–కోనేరుకుప్పం రొడ్డు 5.77 కి.మీలకు రూ.2.20 చొప్పున పలు రోడ్లకు నిధులు మంజూరు చేశారు.

ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపును బుధవారం చేపట్టారు. ఆలయంలో కొట్టు మండపంలో ప్రధాన హుండీలతోపాటు, పరివార దేవత వద్ద హుండీలను సైతం భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ.2,18,65,233 ఆదాయం వచ్చినట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. అలాగే బంగారం 134 గ్రాములు, వెండి 698.5కిలోలు, విదేశీ కరెన్సీ 151 వచ్చినట్లు వివరించారు. ఆగస్టు 30 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఈ ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

సమర్థ పాలనతోనే దేశాభివృద్ధి



ఐఐటీ విద్యార్థులతో జయప్రకాష్ నారాయణ

ఏర్పేడు : సమర్థవంతమైన పాలనతోనే దేశాభివృద్ధి సుస్థిరంగా సాగుతుందని లోకసత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ స్పష్టం చేశారు. బుధవారం ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో 'ఇండియా రోడ్ అహెడ్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ, చట్ట పాలన, విద్య, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు వంటి సామూహిక అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వాలు ఎందుకు అవసరమో వివరించారు. దేశంలో ప్రజాస్వామ్య విధానం, ఆర్థిక పరిణామం, సాంకేతిక విప్లవం కోసం నూతన ఆవిష్కరణల ఆవశ్యతకను విశదీకరించారు. సుస్థిర, సమ్మిళిత వృద్ధి సమాన అభివృద్ధిని నిర్ధారించేందుకు సమాజంలోని వివిధ వర్గాల మధ్య అంతరం తగ్గించేందుకు ఆవిష్కరణలు ఉపయోగపడతాయన్నారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పరిశ్రమ వంటి రంగాలే ప్రధాన ఆర్థిక వ్యవస్థలని వెల్లడించారు. అనంతరం ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీ పదేళ్ల ప్రస్థానం, సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు.

ఎస్వీ వెటర్నరీలో జాతీయ సదస్సు ప్రారంభం



పశువైద్య చికిత్స, శస్త్రచికిత్సలకు సంబంధించి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ వీసీ తిలగర్, వెటర్నరీ వీసీ జేవీ రమణ, అసోసియేట్ డీన్ జగపతి రామయ్య తదితరులు

- 14 రాష్ట్రాల నుంచి హాజరైన 250 మంది పశువైద్య విద్యార్థులు

చంద్రగిరి: పశుపక్ష్యాదులకు అందించాల్సి మెరుగైన వైద్య సేవలు, శస్త్రచికిత్సల కోసం తిరుపతి ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి తమిళనాడు వెటర్నరీ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ తిలగర్ హాజరవ్వగా, ప్రత్యేక అతిథిగా ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ జేవీ రమణ, ప్రొఫెసర్ ప్రతాబన్ పాల్గొన్నారు. ఎస్వీ వెటర్నరీ చికిత్స, టీచింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి 14 రాష్ట్రాల నుంచి 25 పశువైద్య కళాశాలలకు చెందిన 250 పశువైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ తిలగర్ మాట్లాడుతూ.. పశువైద్యంలో స్పెషలిలైజేషన్ చాలా అవసరమన్నారు. పశువైద్య విద్యార్థులు స్కిల్‌తో పాటు ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వీసీ జేవీ రమణ మాట్లాడుతూ.. పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ పాత్ర చాలా ఉందని తెలిపారు. ప్రొఫెసర్ ప్రతాబన్ మాట్లాడుతూ.. శస్త్ర చికిత్స విభాగం, డయాగ్నోసిస్ విభాగం ప్రాముఖ్యత, వ్యాధి నిర్ధారణ విభాగాల పాత్ర చాలా అవసరమన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ వి. వైకుంఠరావు, పశు వైద్య కళాశాల, తిరుపతి అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతి రామయ్య తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ప్రొఫెసర్ వీరబ్రహ్మయ్య వ్యవహరించారు. అనంతరం పశువైద్య, శస్త్రచికిత్సలకు సంబంధించిన బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు.



కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ వైకుంఠరావు

సమస్యలు గుర్తించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను తనిఖీ చేసి సమస్యల నివేదికలను సమర్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల నివేదికలను సంబంధిత హెచ్‌వోడీలకు అందజేయాలన్నారు. నిధులకు ఎలాంటి కొరత లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.10 లక్షలు, వివిధ సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వసతి గృహాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'నవోదయం' నగుబాటు!

- 'సారా' మాన్పించడంపై ఎక్సైజ్ శాఖ కసరత్తు
- 239 కుటుంబాలకు రుణాల మంజూరుకు నివేదిక
- సిబిల్ స్కోర్ లేక ఒక్కరికీ పైసా ఇవ్వని బ్యాంకర్లు
- చాపకింద నీరులా విస్తరిస్తున్న నాటుసారా ?



నగరి అడవుల్లో నాటుసారా తయారవుతున్న దృశ్యం (ఫైల్)

చిత్తూరు అర్బన్ : నాటు సారాకు సిబిల్ స్కోరుకు సంబంధం ఏంటనేగా సందేహం. అధికారులు తలుచకుంటే దేనికైె నా లింకులు పెట్టగలరు. జిల్లాలో నాటుసారా వృత్తిని మాన్పించి.. ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో తెరపైకి తీసుకొచ్చిన నవోదయం 2.0 నవ్వులపాలవుతోంది. ఎవరెన్ని చెప్పినా తమ నిబంధనలు మారవంటూ బ్యాంకర్లు చేతులెత్తేయడంతో పంచాయతీ కలెక్టర్ వద్దకు వెళ్లనుంది.

సమాజంలో ఆత్మగౌరవంగా బతకాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ కొన్ని సందర్భాల్లో ఎంచుకున్న కుల వృత్తులు, ఎదురైన పరిస్థితులు అట్టడగు పరిస్థితుల్లోకి నెట్టేస్తాయి. జిల్లాలోని కొన్ని వర్గాలు పల్లెల్లో సేద్యం చేసుకోవడానికి భూముల్లేక, ఉండటానికి సొంత ఇళ్లులేక రెండు, మూడు తరాల కిందట ఎంచుకున్న నాటు సారా తయారీని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఏళ్ల తరబడిగా సారా తయారీను వృత్తిగా ఎంచుకున్న కుటుంబాలు ఆ ఊబి నుంచి బయటకు రాలేకున్నాయి. ఇదే సమయంలో కూలీలకు డబ్బులు ముట్టజెప్పి రూ.కోట్లు గడించిన వాళ్లు ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలు కుటీర పరిశ్రమలుగా మారిపోయాయి. 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నవోదయం తీసుకొచ్చినా.. సారా తయారీ కుటుంబాలపై సమాజంలో అసమానతలను తొలగించడంలో విఫలమయ్యింది.

సిబిల్ స్కోర్ లేదు.. రుణాలు ఇవ్వం

సారా మాన్పించడానికి ఎవరెవరికి ఏయే రుణాలు ఇవ్వాలనేదానిపై ఎక్సైజ్ అధికారులు ఓ నివేదిక సిద్ధంచేసి కలెక్టర్‌కు ఫైలు పంపించారు. తొలుత తాకట్టులేనిదే రుణం ఇవ్వబోమని మొండికేసిన బ్యాంకర్లు.. కలెక్టర్ చీవాట్లు పెట్టడంతో సరేనన్నారు. తీరా ఇప్పుడేమో అధికారులు ప్రతిపాదించిన వాళ్లకు సిబిల్ స్కోర్ లేదని, రుణాలు మంజూరు చేయడానికి నిబంధనలు ఒప్పుకోవంటూ మొండికేసి కూర్చుకున్నారు. సారా తయారీను వదలిస్తే రుణాలు ఇప్పిస్తామన్న ఎక్సైజ్ అధికారులు మాటలు వట్టివేనంటూ ఇప్పటికే పలు కుటుంబాలు మళ్లీ సారా ఊబిలోకి దిగుతున్నాయి. వీటిని నడిపిస్తున్న వ్యక్తులు సైతం క్రమంగా నాటుసారా విస్తరిస్తూ పోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

అదే పేరు.. అదే తీరు..

ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నవోదయం 2.0ను తీసుకొచ్చింది. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరులోపు జిల్లాలో ఎక్కడా నాటు సారా ప్యాకెట్ ఒక్కటి కూడా తయారు కాకూడదని ఎక్సైజ్ శాఖకు బాధ్యతలు పురమాయించింది. చిత్తూరులోని రాసనపల్లె, పాలసముద్రంలోని నరసింహాపురం, నగరి సత్రవాడ, విజయపురం మంగళం, కెవి.పురం, పుంగనూరులోని పెద్దతండా, నల్లగుంట్లపల్లె తండా, పత్రపల్లె తండా ల్లాంటి 52 సారా తయారీ కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా గుర్తించారు. సారా తయారీ తప్ప మరో దారి తెలియని 239 కుటుంబాలను గుర్తించి.. వీళ్లకు స్వయం ఉపాధి కల్పించడానికి బ్యాంకు రుణాలు ఇవ్వడమే ఏకైక మార్గమని నివేదిక రూపొందించారు. బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడానికి ఫైలు సిద్ధం చేయగా.. బ్యాంకర్ల నుంచి ఊహించని ట్విస్టు ఎదురయ్యింది.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం



సారా వదిలేసిన వాళ్లల్లో చాలా మందికి ప్రైవేటు ఫ్యాక్టరీల్లో ఉపాధి అవకాశాలు కల్పించాం. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇప్పించాం. కొందరు బ్యాంకర్లు మేము ప్రతిపాదించిన వ్యక్తులకు సిబిల్ స్కోర్ లేదని, రుణాలు ఇవ్వమంటున్నారు. దీనివల్ల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చే అవకాశం ఉంది. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

– శ్రీనివాస్, ఈఎస్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, చిత్తూరు

క్లుప్తంగా

ఆటో ఢీకొని చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం

నగరి : మండలంలోని మునెప్పనాయుడు కండ్రిగ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బిందుప్రియ (5) అనే చిన్నారి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రాజేష్ కుమార్తె బిందు ప్రియ వీధిలో ఆడుకుంటుండగా ఆ వైపు వేగంగా వచ్చిన ఆటో చిన్నారిని ఢీకొనడంతో పాటు చిన్నారిపై నుంచి పోవడంతో చిన్నారి తీవ్రంగా గాయపడింది. వెంటనే చిన్నారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఉడుమును వేటాడిన ఇద్దరు అరెస్టు



నిందితులను చూపుతున్న అటవీశాఖ అధికారులు

చిత్తూరు కార్పొరేషన్ : ఉడుమును వేటాడిన ఇద్దరి వ్యక్తులపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. బుధవారం అటవీశాఖ ఈస్ట్ ఎఫ్ఆర్వో థామస్ వివరాలు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన జిల్లాలోని పాలసముద్రం మండలంలో ఉడుమును వేటాడిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వేటాడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ ఎఫ్ఎస్వో చండికుమార్, బీట్ ఆఫీసర్‌లు బాలాజీ, ప్రభాకర్‌రెడ్డి, గౌస్‌భాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ వీసీగా నర్సింగరావు



తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ టాటా నర్సింగరావును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రొఫెసర్ నర్సింగరావు బెనారస్ వర్సిటీలో పీజీ పూర్తి చేసి పలు ఐఐటీ కళాశాలల్లో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తించారు. మంత్రి లోకేష్ వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆయన ఎస్వీయూ వీసీగా నియమితులయ్యే అవకాశముందని రెండు నెలల ముందే సాక్షి పత్రిక పసిగట్టింది. ఈ మేరకు కథనాలు ప్రచురించడం గమనార్హం. శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీని తమ ఆధీనంలో ఉంచుకోవడం కోసమే మంత్రి లోకేష్ తనకు అనుకూలంగా వ్యవహరించే వ్యక్తికి వైస్ చాన్సలర్ పదవిని కట్టబెట్టినట్లు జిల్లాలో విస్తృతంగా చర్చసాగుతోంది.

కట్టమంచి.. ప్రమాదం పొంచి

కట్ట మంచి చెరువులో ఇష్టానుసారంగా మట్టిని తవ్వేశారు. చెరువులో అధిక లోతుకు మట్టి తవ్వడంతో కట్ట బలహీనపడి గండి పడే ప్రమాదం పొంచి ఉంది. చెరువులో ఎక్కువ లోతుకు మట్టి తవ్వేయడంతో డేంజర్ జోన్‌లో ఉన్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో నడిబొడ్డున ఉండే కట్టమంచి చెరువుకు ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. అటు వంటి చెరువును తమ అక్రమార్జన కోసం స్వరూపాన్నే మార్చేశారు. ఫలితంగా అధిక వర్షాలు కురిస్తే చెరువు కట్ట తెగే ప్రమాదం ఉందని నగర వాసులు భయాందోళనకు వ్యక్తం చేస్తున్నారు.

- అక్రమ తవ్వకాలతో అనర్థాలు
- ఎక్కువ లోతు పూడికతీతతో తీవ్ర నష్టం
- వర్షాలకు చెరువు కట్ట తెగే ప్రమాదం
- కూటమి నేతల అక్రమ మట్టి తవ్వకాలతోనే ఈ పరిస్థితి


అధిక లోతు మట్టి తవ్వకాలతో ఒకేచోట నిల్వ ఉన్న నీరు


గతంలో కురిసిన అధిక వర్షాలకు నివాసప్రాంతాల వద్దకు చేరిన నీరు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లా కేంద్రంలో నడిబొడ్డున ప్రసిద్ధి గాంచిన కట్టమంచి చెరువు సుందరీకరణకు తొలి అడుగు అంటూ గత ఏడాది సెప్టెంబర్ 24న కూటమి నేతలు హంగామా చేసి భూమి పూజ చేశారు. సుందరీకరణ చేపడుతున్నామంటూ ప్రజలను ఏమార్చారు. రోజులు గడిచే కొద్దీ కట్ట మంచి చెరువులో జరిగే అభివృద్ధి ఏమిటనేది ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యింది. జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండు, రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో కట్ట మంచి చెరువు ఉండటంతో అటు వైపుగా వెళ్లే ప్రతి ఒక్కరూ కూటమి నేతలు జరిపిన అక్రమ మట్టి తవ్వకాలను చూసి ఆశ్చర్యపోయారు. పొక్లయిన్, జేసీబీలతో యథేచ్ఛగా మట్టిని తవ్వి ఆ చెరువు తల్లికి తీరని శోకం నింపారు. ఎక్కువ లోతు మట్టిని తవ్వితే ప్రమాదం జరుగుతుందనే ఆలోచన కూడా లేకుండా వందల లోడ్ల మట్టిని అక్రమంగా తరలించి జేబులు నింపుకున్నారు. కూటమి నాయకులు చేపట్టిన పనులు సుందరీకరణగా లేకపోయినప్పటికీ కట్ట మంచి చెరువు ను డేంజర్ జోన్‌లోకి నెట్టేసింది.

చెరువు కట్టలకు ప్రమాదం

కట్ట మంచి చెరువులో ఎక్కువగా మట్టి తవ్వడం వల్ల కట్ట బలహీనపడే అవకాశాలున్నట్లు నగర వాసులు భయాందోళనకు లోనవుతున్నారు. భవిష్యత్తులో ఎక్కువ వర్షాలు కురిస్తే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని ఆందోళన చెందుతున్నారు. ఇష్టానుసారంగా అధిక స్థాయిలో మట్టిని తవ్వడం వల్ల కట్టమంచి చెరువులో భూగర్భ జలాల రీచార్జ్ సరిగ్గా జరగదని నిపుణులు వెల్లడిస్తున్నారు. బోర్లల్లో సైతం నీటి స్థాయి తగ్గుతుందని చెబుతున్నారు. మట్టిని ఎక్కువ లోతు తవ్వడంతో చెరువు సహజ జీవావరణం మారిపోతుంది. చెరువు భూమి కింద ఉన్న రాతి పొరలు బయటపడి భూమి ఉత్పాదకత తగ్గిపోతుందని విశ్లేషకులు చెబుతున్నారు. చెరువులో అనియంత్రితంగా మట్టిని తవ్వడం వల్ల తాత్కాలిక లాభం కంటే దీర్ఘకాల నష్టాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అధిక వర్షాలు కురిస్తే కట్ట మంచి చెరువుకు సమీపంలో ఉండే ఆర్టీసీ బస్టాండు, సమీపంలో ఉండే కట్టమంచితో పాటు మరికొన్ని ప్రాంతాలు నీట మునిగే అవకాశాలు ఎక్కువగా ఉందని నిపుణులు వెల్లడిస్తున్నారు.

సంరక్షణ శూన్యం

చెరువు సంరక్షణకు చర్యలు చేపట్టాల్సింది పోయి సుందరీకరణ పేరుతో మట్టిని అక్రమంగా తవ్వేశారు. అక్రమమట్టి తవ్వకాల వల్ల చెరువుకు చుట్టూ ఉన్న ఫెన్సింగ్ దెబ్బతింది. చెరువుకు సమీపంలో నిర్మించిన కాలువ కుంగిపోయింది. పలు చోట్ల పగుళ్లు ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. మట్టి లోతు 1 నుంచి 1.5 మీటర్ల వరకు మాత్రమే తొలగించాల్సి ఉంటే అంతకంటే ఎక్కువ లోతుకు తవ్వేశారు. దీంతో కట్టమంచి చెరువు సహజ రూపురేఖలు మారిపోయాయి. చెరువులోకి వచ్చే నీటి ప్రవాహ మార్గాలను శుభ్రం చేయకుండా అనేక వ్యర్థ పదార్థాలు అధికంగా చేరిపోయాయి. చెరువులో పీవోపీ విగ్రహాలు అలాగే ఉండటంతో కలుషితంగా మారింది. చెరువు కట్టకు దగ్గరలో తవ్వడం వల్ల అధికవర్షాలకు ప్రమాదం చోటు చేసుకునే అవకాశాలు అధికంగా ఉన్నట్లు నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మారిన కట్టమంచి చెరువు స్వరూపం


అధికలోతు మట్టి తవ్వకాలతో రూపురేఖలు మారిన కట్టమంచి చెరువు

అక్రమ మట్టి తవ్వకాలతో కట్టమంచి చెరువు స్వరూపం మారిపోయింది. చెరువులో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువలోతుకు మట్టిని తవ్వేశారు. ఇలా తవ్వడం వల్ల పర్యావరణ, భౌగోళిక నష్టాలు తప్పవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. లోతు ఎక్కువగా తవ్వడంతో చెరువు సహజ సమతల నిర్మాణం దెబ్బతీసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇష్టానుసారంగా తవ్వకాలు జరపటంతో వర్షాకాలంలో నీరు సరిగ్గా నిల్వ కాకపోవడం, చెరువులో ఒకవైపు మాత్రమే చేరి నిల్వ ఉంటుందని వెల్లడిస్తున్నారు.


అధిక వర్షాలు కురిస్తే నీటమునిగే ప్రాంతాలు


కట్టమంచి చెరువుకు ఆనుకుని ఉన్న కాలువ గోడలు కుంగిపోయిన దృశ్యం


గతంలో అధిక వర్షాలకు అధికంగా నీరు వచ్చిన కొత్తబస్టాండ్ ప్రాంతం

కూటమి నేతల వాదనలు ఇలా..

కట్ట మంచి చెరువులో నిర్వహించిన అక్రమ తవ్వకాల వ్యవహారం కొన్ని నెలలుగా జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కట్టమంచి చెరువులో పూడికతీత పనుల వల్ల చిత్తూరు నగర పరిధిలో ఉండే బోర్లకు నీరు రీచార్జ్ అవుతుందని వెల్లడిస్తున్నారు. చిత్తూరు నగర పరిధిలో ఉండే దాదాపు 500 బోర్లకు పూడికతీత పనుల వల్ల ప్రయోజనం కలుగుతుందని కూటమి నేతలు వాదిస్తున్నారు. అయితే నిష్ణాతుల అభిప్రాయాలు, అధికారుల అనుమతులు, పర్యావరణ నిబంధనలు పాటించకుండా అక్రమంగా కట్టమంచి చెరువులో అక్రమ తవ్వకాలు నిర్వహించడం భవిష్యత్తులో నష్టమేనని అధికశాతం మంది అభిప్రాయపడుతున్నారు.

సర్కారుకు షాక్ తప్పదు

తిరుపతిలో రోడ్డెక్కిన విద్యుత్ ఉద్యోగులు

- ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట మహాధర్నా
- ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని మండిపాటు
- 13న చలో విజయవాడకు పిలుపు
- 15 తర్వాత సమ్మెకు దిగుతామని హెచ్చరిక


ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న జేఏసీ నేతలు

తిరుపతి రూరల్ : విద్యుత్ శాఖలో సమస్యల పరిష్కారం కోసం వేలాది మంది విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ట్రాన్స్‌కో, జెన్‌కో ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు రోడ్డెక్కారు. బుధవారం తిరుపతిలోని ఏపీ ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టారు. తిరుపతి డిస్కం పరిధిలోని ఐదు జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కూటమి ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఎంప్లాయాస్ సంఘాల సమాఖ్య (జేఏసీ) తిరుపతి డిస్కమ్ చైర్మన్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జేఎల్ఎం గ్రేడ్–2 కింద నియమితులైన కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. డిస్కమ్ కో–చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ యాజమాన్యం అనుసరించే అశాస్త్రీయ విధానాల కారణంగా విద్యుత్ సంస్థలకు నష్టం వస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి యాజమాన్యాలు తప్పుడు నివేదికలు ఇవ్వడం వల్లే ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. డిస్కమ్ కన్వీనర్ మురళీధర్ మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తూ దూర విద్య కళాశాలల్లో ఉన్నత చదువులు చదివి అర్హత సాధించిన వారికి ఉద్యోగోన్నతులు కల్పించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్లడించారు. డిస్కమ్ వైస్ చైర్మన్ జయరాం మాట్లాడుతూ ఉద్యోగులపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం నిరంకుశ ధోరణికి నిదర్శనమన్నారు. డిస్కమ్ వైస్ చైర్మన్ జయమణి మాట్లాడుతూ జేఎల్ఎం గ్రేడ్ 2 కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు వారికి విధించిన కొత్త సర్వీసు రెగ్యులేషన్స్‌ను రద్దు చేసి శాశ్వత ఉద్యోగులతో సమానంగా సర్వీసు రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశార9ఉ. తిరుపతి సర్కిల్ జేఏసీ చైర్మన్ వెలకటూరి గోపి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రెగ్యులర్ ఉద్యోగస్తులతో పాటు వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్డ్ అయిన వారికి అపరిమిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యుత్ ఉప కేంద్రాల్లో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

మోసానికి నిరసనగానే..

కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఉద్యోగులను మోసం చేసినందుకు నిరసనగానే ఈనెల 13న చలో విజయవాడ చేపడుతున్నట్లు జేఏసీ నేతలు తెలిపారు. ప్రభుత్వంపై పోరాటానికి ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటి కూడా ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు స్పందించకుంటే ఈనెల 15 తర్వాత నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు ఎల్.చలపతి, వై.వెంకట సునీల్, వి.సతీష్, టి.రవికుమార్, సురేష్,రియాజ్ అహ్మద్, రామలింగారెడ్డి, సంజీవరావు, కృష్ణయ్య , తిరుపాల్ రెడ్డి ,రంగయ్య ,హుస్సేనయ్య , శంకర్, బాలకాశి, నాగార్జున, సుధాకర్, ఏలుమలై పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహ బంధం

ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఒకే వ్యాపార రంగంలో స్థిర పడ్డారు. ఇద్దరూ తమ బిడ్డలను చదివించి, పెళ్లిళ్లు చేసి బాధ్యతలను పూర్తి చేశారు. ఇద్దరూ కలసి బుధవారం శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబికా సమేత శ్రీవాయు లింగేశ్వరస్వామిని దర్శించుకొన్నారు. సంతోషంగా ఇంటికి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఆ ఇద్దరి స్నేహితులను కబళించింది. ఈ విషాదకర ఘటన పుత్తూరు బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది.

- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- బంధువుల రోదనలతో పుత్తూరు ఆసుపత్రి



మృతులు మూర్తి.. సుబ్రమణ్యం

పుత్తూరు : కైలాసవాసా ఉన్నెపొత్తదానే వందారు.. కైవిట్టియే సామి అంటూ పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి బంధువుల రోదనలతో మార్మోగింది. బుధవారం సాయంత్రం స్థానిక బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తమిళనాడు పళ్లిపట్టు తాలుకా పొద్దటూరుపేటకు చెందిన మూర్తి (58), సుబ్రమణ్యం(56) అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు.. పొద్దటూరుపేటకు చెందిన పవర్‌లూమ్స్ కార్మికులైన మూర్తి, సుబ్రమణ్యం ఇద్దరు బుధవారం ఉదయం బైక్‌పై శ్రీకాళహస్తి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకొన్నారు. తిరుగు ప్రయాణంలో పుత్తూరు బైపాస్ రోడ్డులో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదం జరిగిన చోట సీసీ కెమెరాలను పరిశీలించి వాహనాన్ని గుర్తించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల్లో మూర్తికి నలుగురు పిల్లలు కాగా, సుబ్రమణ్యానికి ముగ్గురు పిల్లలు అందరికీ వివాహాలు అయ్యాయి.

హత్యగా మలుపు తిరిగిన ఆత్మహత్య కేసు

- ప్రియుడితోకలిసి భర్తను హతమార్చిన భార్య
- చిత్తూరులో వెలుగుచూసిన వైనం

చిత్తూరు అర్బన్ : భర్తలను హతమార్చడం ఇటీవల సోషల్ మీడియాలో ట్రెండ్‌గా నిలుస్తోంది. కూల్ డ్రింక్‌లు, డ్రమ్‌లు, టైల్స్ తీసి పాతిపెట్టడం, విద్యుత్‌షాక్‌తో చంపేయడం వంటి వరుస ఘటనలు.. పలు ప్రాంతాల్లో వెలుగు చూశాయి. తాజాగా చిత్తూరు నగరంలో ఓ భార్య తన ప్రియుడితో కలిసి చున్నీతో భర్తను హతమార్చింది. భర్తే ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య తొలుత పోలీసులకు ఫిర్యాదు చేసి ఆపై అడ్డంగా దొరికిపోయింది. ఈ ఘటనకు సంబంధించి టూ టౌన్ సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. చిత్తూరు నగరం సంతపేటకు చెందిన వెంకటేష్ (37) కోళ్ల బండి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి ఇద్దరు భార్యలు, పిల్లలున్నారు. మొదటి భార్యకు పిల్లలు లేనికారణంగా..రెండో భార్య మున్నెమ్మతో కలిసి ఉంటున్నాడు. అయితే మంగళవారం చున్నీతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడని... మున్నెమ్మ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు గా నిర్ధారించారు. ఈవిషయాన్ని మున్నెమ్మ మృతుడి మొదటి భార్య, తల్లికి చెప్పింది. ఆపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కాగా పోస్టుమార్టం నివేదికలో మృతుడి గొంతుపై కొన్ని గుర్తులు ఉండడంతో పోలీసులు ఇదీ హత్య కేసుగా మార్పు చేశారు. ఆపై తమదైన శైలిలో పోలీసులు భార్య మున్నెమ్మను ప్రశ్నించారు. మృతుడి రెండో భార్యకు ఓ వ్యక్తితో ఉన్న సన్నిహిత సంబంధం వెంకటేష్‌కు తెలియడంతో గొడవకు దిగాడు. మద్యం మత్తులో ఉన్న వెంకటేష్‌ను చంపడానికి ప్రియుడిని ఇంటికి పిలిచి ఇద్దరూ కలిసి వెంకటేష్‌ను హతమార్చారు. దీనిపై పోలీసులు లోతుగా విచారిస్తున్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి


మర్రికుంటవారిపల్లెలో ఏనుగులు తొక్కేసిన వరిపంట

పులిచెర్ల(కల్లూరు): పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. రోజూ ఎక్కడో ఒక చోట ఈ దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా బుధవారం తెల్లవారుజామున మండలంలోని మర్రికుంట వారిపల్లె, వంకాయల పాటివారిపల్లె, దేవళంపేట, అయ్యావాండ్ల పల్లె, కురవపల్లెలోని చేతికొచ్చిన పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం కలిగింది. రోజురోజుకూ ఏనుగుల బెడద ఎక్కువవుతోంది. మండలంలో వరి పంటలను తొక్కి నాశనం చేస్తూనే ఉన్నాయి.

ఎర్రచందనం స్వాధీనం

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం ఎఫ్ఆర్ఓ నారాయణ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది దాడులు చేసి రెండు ఎర్రచందనం దుంగలతోపాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు దాచినట్లు సమాచారం రావడంతో అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను పట్టుకోగా కొంతమంది పరారయ్యారు. నిందితుల కోసం విచారణ చేపడుతున్నట్లు ఎఫ్ఆర్ఓ నారాయణ వెల్లడించారు.

కల్తీ మద్యం.. కూటమికి నైవేద్యం

- రాష్ట్రంలో విచ్చలవిడిగా లిక్కర్ దందా
- ప్రభుత్వ తీరుపై వైఎస్సార్‌సీపీ మహిళల ఆగ్రహం
- ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద ధర్నా


తిరుపతిలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బైఠాయించిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు

తిరుపతి మంగళం : రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలు కాసుల కక్కుర్తితో కల్తీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీతాయాదవ్, తిరుపతి నగర బూత్‌కమిటీ ఇన్‌చార్జి ఉప్పాల సాయికుమారి మండిపడ్డారు. బుధవారం ఈ మేరకు తిరుపతిలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద మహిళలతో కలిసి ధర్నా నిర్వహించారు. మద్యం సీసాలను పగులగొట్టి నిరసన తెలిపారు. కల్తీ మద్యం అరికట్టాలి, బెల్ట్ షాపులను తొలగించాలి, నకిలీ లిక్కర్ తయారుచేస్తున్న టీడీపీ, జనసేన నేతలపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. టీడీపీ నేతలే విచ్చలవిడిగా కల్తీ మద్యం తయారు చేసి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబుకు దోచుకోవడం, దాచుకోవడం తప్ప నకిలీ లిక్కర్ కారణంగా మహిళల పుస్తెలు తెగిపోతున్నా పట్టదని ఆరోపించారు. ఈ ఏడాదిన్నరలోనే కల్తీ మద్యం తాగి వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా లిక్కర్ దందాను నిలిపివేయకుంటే ఇదే మద్యం ఒంటిపై పోసుకుని ఆత్మాహుతి చేసుకుంటామని హెచ్చరించారు. పవన్‌కల్యాణ్‌కు ఇప్పుడు కల్తీ లిక్కర్ కనిపించం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుణీత, పార్టీ నేతలు నైనారు మధుబాల, విజయలక్ష్మి రాయల్, పద్మజ, పుష్పలత, మహిత, రాజేశ్వరి, రాధ, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల రవాణాలో ఐదేళ్ల జైలు


పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

చిత్తూరు అర్బన్/చిత్తూరు లీగల్: అనుమతి లేకుండా పేలుడు పదార్థాలను రవాణా చేస్తున్న వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్, జిల్లా సెషన్స్ న్యాయస్థానం బుధవారం తీర్పునిచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ కథనం మేరకు.. 2019 ఫిబ్రవరి 22వ తేదీన కుప్పం మండలం మల్లనూరు–తిరుపత్తూరు రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు.

తమిళనాడుకు చెందిన ఓ ట్రాక్టర్ డ్రైవర్ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా 40 జిలెటిన్ స్టిక్స్, 40 డిటోనేటర్లు లభించాయి. ట్రాక్టర్‌ను సీజ్ చేసిన అప్పటి కుప్పం సీఐ జిటి.నాయుడు.. తమిళనాడు వేలూరుకు చెందిన నిందితుడు మురుగన్ మన్నుకన్(39)ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక తీర్పునిచ్చారు. అనంతరం నిందితుడిని చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బైరెడ్డిపల్లె: కర్ణాటక నుంచి తమిళనాడుకు తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని గురువారం ఉదయం బైరెడ్డిపల్లె పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు తమిళనాడుకు చెందిన వెంకటప్రసన్న (36) కారులో కర్ణాటకలో మద్యం కొనుగోలు చేసి బైరెడ్డిపల్లె మీదుగా తమిళనాడుకు తరలిస్తుండగా నెల్లిపట్ల సమీపంలోని నల్లగుట్లపల్లె వద్ద సుమారు రూ.90 వేలు విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.